# బెలామర్రి

## టి.పి.యస్.మూర్తి

రాత్రి పది గంటలయింది. అదే పనిగా కూచొని అప్పటికి రెండు పెట్టెల సిగరెట్లు తగలేసాడు విశ్వనాధం. జుట్టు పీక్కున్నాడు. ఎంత ఆలోచించినా, ఎంత బాధపడ్డా తన చేతకానితనానికి కారణం తెలియకుండాపోతోంది.

తను ఏ కథ వ్రాసినా వేలాది పాఠకులు హర్షాన్ని వెలిబుచ్చడం తనకి తెలుసు. సినిమాలో ఏ సీనుకి డైలాగులు వ్రాసినా ప్రేక్షకుల హర్షధ్వానాలు తనకి తెలుసు.

కాని ఈ ఫీల్డులో నెగ్గుకురాలేకపోతున్నాడు. కారణం!

మర్రి చెట్టు నీడన ఏ మొక్కా ఎదగదు.

ప్రఖ్యాత రచయితగా, యావదాంధ్ర దేశ పాఠక లోకాన్ని తన రచనలతో చక్కిలిగింతలు పెట్టి నవ్వించి, ప్రేమ సన్నివేశాల్లో ఏవేవో లోకాల్లో విహరింప చేసి, విషాద సన్నివేశాల్లో గుండెలు బరువెక్కించి ఓహో రాజారావ్! హేట్సాఫ్! నీ రచనలకి నీకు దాసోహం!

యావత్ పాఠకలోకంచేత జేజేలు కొట్టించుకున్న రాజారావు దగ్గిర అసిస్టెంట్‌గా సాలె పురుగు గూటిలో చిన్న పురుగులా చిక్కుకుపోవడమే తను చేసిన పొరపాటు.

అసిస్టెంట్‌గా చేరి ఏడు, ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకూ తన ప్రతిభని రాజారావుగారు గుర్తించలేదు. గుర్తించడానికి ఆయనకి ఇష్టం లేదో, లేక మిగిలిన శిష్యగణం గుర్తించ నివ్వడంలేదో విశ్వనాధానికి ఇప్పటికీ అర్థం కాకుండా పోతోంది.

రాజారావుగారు ప్లాట్‌ని మూడు ముక్కల్లో చెప్తే దానికి చిలవలు, పలవలు అల్లి కథని తయారు చేసి విశ్వనాధం ఆయన ముందుంచితే, అలా అలా పేజీలు తిరగేసి పెన్సిలు టిక్కులు పెడితే అది రాజారావుగారి పేరు మీద అచ్చు పడి పుస్తక రూపంలో వెలువడుతుంది. చెక్కు ఆయన అకౌంటుకి జమ అవుతుంది.

ఫలానా పుస్తకం చాలా బాగుంది. అది ఓ కళాఖండం. మళ్ళీ ఏ రచయితా అలా రాయలేడు. రచించిన రాజారావుగారికి ప్రత్యేక అభినందనలు.

ఇలా వచ్చిన ఉత్తరాల్ని చూసుకొని విశ్వనాధం లోలోపల సంతోషించడమే కారణం? "అలాంటి రచనల్ని రాజారావుగారే చెయ్యగలరు." అన్న ప్రచారం, తనలాటి వాడు వ్రాసేదన్నా "ఓరి వెర్రివాడా?" అన్న ఓ వెక్కిరింత నవ్వు మాత్రమే మిగులుతుంది.

కాని తప్పేదు. రాజారావుగారి అండన లేకుంటే పేరు మాట దేవుడెరుగు, రోజు గడవడం కష్టం అయిపోతుంది. ఏ పబ్లిషరు చూడడు. ఏ ప్రొడ్యూసరు పిలవడు.

ప్రొఫెషనుకి, ఫీల్డుకి పాతవాడైనా, కొత్తగా వైద్యం మొదలు పెట్టిన వాడిలాగే అయిపోతుంది.

అదే రాజారావుగారిలో ఉన్న ప్రత్యేకత. ఆయన ఓ పెద్ద మర్రి చెట్టు, ఆ చెట్టు నీడన విశ్వనాధం లాటి ఎదగలేని పిచ్చి మొక్కలు.

"ఏరా విశ్వం! ఇంకా పడుకోలేదా!" అప్పుడే గదిలోకి అడుగు పెడుతూ అన్నాడు ప్రసాదరావు.

అతని రాకని గమనించని విశ్వనాధం మడత మంచం మీద పడుకునే సిగరెట్టు పొగని రింగు రింగులుగా వదుల్తున్నాడు.

"ఏరా బడుద్ధాయి నిన్నే! ఛోంచేసావా?" ప్రసాదరావు మళ్ళీ ప్రశ్నించాడు.

"ఊఁహుఁ" నోరు విప్పకుండానే సమాధాన మిచ్చాడు విశ్వం.

"ఏమిటి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?" అడిగాడు ప్రసాదరావు బట్టలు మార్చుకుంటూ.

"రేపు మా ఊరెళ్ళిపోదామనుకుంటున్నాను" అన్నాడు విశ్వనాధం.

ఉలిక్కిపడ్డాడు ప్రసాదరావు.

"అదేమిటి గురువుగారు కొత్త పిక్చరుకి ఎగ్రిమెంటు ఇచ్చేసారు. కొత్త నవలలకి ఒప్పేసు కున్నారు. రేపొద్దున్నా నీకు ప్లాటు చెబుదామను కుంటున్నారు. అలాటప్పుడు అన్నిటికి సమర్ధుడివి నువ్వెళ్ళిపోతానంటే ఎలా?" అన్నాడు ప్రసాదరావు మంచం మీదికి వాలుతూ.

అందుకే వెళ్ళిపోదామనుకుంటున్నాను. పేరు మాట ఎలా ఉన్నా, కష్టానికి తగ్గ ఫలితం లేకుండా పోతోంది. ఇంటికి పోతే కాస్త మజ్జిగ అన్నం తినైనా పడుండొచ్చు" అన్నాడు సీరియస్‌గా విశ్వనాధం.

"ఇవాళ ఏమైందిరా నీకు? పోనీ జీతం పెంచమని అడగొచ్చుగా?" అన్నాడు ప్రసాదరావు.

"చూడు ప్రసాద్! మనకిచ్చేది ముష్టి అయిదు వందలు. కాని మనం వ్రాసిన అక్షరాల్తో వ్యాపారం చేసి లక్షలు గడిస్తున్నాడు ఆయన. కళ్ళు మండు తున్నా, బుర్ర వేడెక్కిపోతున్నా కష్టపడి వ్రాసిన దానిని ఎగాదిగా చూసి ఛండాలంగా వ్రాసావు, ఈ ప్రొఫెషనుకే పనికి రావని తిట్టి, వాటినే ఏ మాత్రం మార్చకుండా డైరెక్టర్లకి ఇస్తే అవే సిన్మాలు బ్రహ్మాండంగా హిట్ అవుతున్నాయి. మరి నేను చేతకాని వాడినేనా, అందుకు తగ్గ ఫలితం నాకు న్యాయంగా ముడుతోందా?"

విశ్వనాధం వాగ్ధాటిని చెవులు అప్పగించి వింటున్నాడు ప్రసాదరావు.

"అది అన్యాయమే అనుకో! కాని మనలాటి కుర్ర రచయితలకి రాజారావుగారికంటే దిక్కులేదే!మనమేదో దేశాన్ని ఉద్ధరించేస్తామని, మరమ్మత్తులు చేసేస్తామని చదువుతున్న చదువుల్ని మధ్యలోనే మంట కలిపేసి మెడ్రాసు మెయిలు ఎక్కి చక్కా వచ్చేసాము! మరి ఇప్పుడేమిటి దారి?" అన్నాడు ప్రసాదరావు.

"గోదారి! ఈ రాతలు, కోతలు కాకపోతే రిక్షా లాక్కుని బ్రతుకుదాం. ఇంకా ఎన్నాళ్లోయ్ నీకు చెప్పేది, ఇలాగేనా రాస్తారు. జనం చెప్పులు విసిరేస్తారు అని మన రచనల్ని విమర్శిస్తూనే, అవే రచనల్తో రాజారావు డబ్బు చేసుకోవడం నేసహించ లేను." అన్నాడు చిరాగ్గా విశ్వనాధం.

"ఒరేయ్ విస్సూ! నా మాట విను. తొందరపడకు. దేనికైనా కాలం కలిసి రావాలి అప్పుడు మన జండా కూడా ఎగరాలి" అన్నాడు ఓదార్పుగా ప్రసాదరావు.

"కాని ఇలా ఎన్నాళ్ళురా! కావాలంటే నువ్వుండిపో, నేమా వూరు వెళ్ళిపోతాను." అన్నాడు విశ్వనాధం.

"చెప్పంటే వినవేం! ప్రస్తుతానికి నీ ప్రయాణం వాయిదా వెయ్యి. కొద్ది రోజులు పోయాక చూద్దాం." అన్నాడు చిరాగ్గా ప్రసాదరావు.

"సరే రాజారావు సంగతేమిటో పూర్తిగా తేల్చుకొనే వెళ్తాను." అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు విశ్వనాధం.

"అయ్యా విశ్వనాధంగారు దయచెయ్యండి ఇలా!" రాజారావు పలకరించిన తీరుకి మొదట ఆశ్చర్య పోయినా, తేరుకున్నాడు విశ్వనాధం.

పబ్లిషరు పరంధామయ్య, ప్రొడ్యూసరు పీతాంబరం, డైరెక్టరు శివానందం రాజారావు గదిలో కూచున్నారు. రాజారావు నిప్పులు కక్కుతున్నాడు.

"వృద్ధిలోకి రావల్సిన వాడివని నా ఛాన్సు వదులుకొని నీకు అవకాశం ఇస్తే పరంధామయ్య గారికి ఇలాటి చెత్త కథ రాసిస్తావా? పీతాంబరంగారి పిక్చరుకి ట్రాజడీ సీనుకి డైలాగులు వ్రాయమంటే ఇలాగా రాస్తావు. ఛఛ! నీకు ఏ పని చెప్పినా ఇంతే. పైగా పెద్ద రైటయిపోయినట్టు పోజ. ఇప్పుడెలాగ పబ్లిషరుగారికి కథ నచ్చలేదు, పిక్చరు డైరెక్టరు గారికి సీన్లో డైలాగులు నచ్చలేదు." మండిపడు తున్నాడు రాజారావు.

"మార్చి వ్రాయమంటారా?" నిబ్బరంగానే అన్నాడు విశ్వం.

"మార్చే రాస్తావో కూర్చే రాస్తావో పొద్దుటే మాటింగు మొదలు." అన్నాడు ప్రొడ్యూసరు.

"అ ఆ లు నేర్చుకున్న ప్రతివాడు రచయితనంటూ కలం పట్టుకొని సరుకు లేకుండా ఫీల్డులోకి దిగిపోతే ఎలా?" అన్నాడు డైరెక్టరు.

"అసలు నీలాటి వాళ్ళని అసిస్టెంట్లుగా పెట్టుకోవడం నాదే బుద్ధి తక్కువ" ఎగిరిపోతున్నాడు రాజారావు.

ఒళ్ళు మండిపోతోంది విశ్వానికి. కాని నిశ్చలంగా నిలబడ్డాడు. ఈ పరిస్థితి ఎదుర్కోవాలి. లేకుంటే తన వ్యక్తిత్వం వీళ్ళందరి ముందు బలైపోతుంది.

"అంటే నన్ను మీ అసిస్టెంటుగా పెట్టుకోవడం మీ బుద్ధి తక్కువంటారా? లేక నేను మీ అసి స్టెంటుగా చేరడం నా తెలివి తక్కువంటారా?"

విశ్వం నోటంట అప్రయత్నంగా వచ్చిన మాటలకి పక్కలో బాంబు పడ్డట్టుగా ఉలిక్కిపడ్డాడు రాజారావు.

"ఏమిటి నువ్వు మాటాడుతున్నది! నువ్వు నా అసిస్టెంట్‌గా చేరడం నీ తెలివి తక్కువ తనమా? అంటే నువ్వు నన్ను మించిన రైటరువా? అంత

ప్రజ్ఞావంతుడివా?'' రెట్టిస్తున్నాడు రాజారావు.

''అవును. నిజంగానే నీకంటే నేను విద్వత్తు ఉన్నవాడినే కాని నీకున్న చాతుర్యం నాకు లేక తెర వెనుక్కి పోతున్నాను.''

అంత వరకూ ఇచ్చిన గౌరవాన్ని తగ్గించి మాట్లాడుతున్నాడు విశ్వనాథం.

చలనం లేకుండా గుడ్లు అప్పగించి విశ్వాన్నే చూస్తున్నారు అందరూ.

ముఖాన పట్టిన చెమటలు ధారలు కడుతున్నాయి రాజారావుకి.

''ఒంటి మీద తెలివి ఉండే మాటాడుతున్నావా విశ్వం?'' ఘీంకరించాడు రాజారావు.

''పూర్తి తెలివితోనే మాటాడుతున్నాను. సాహిత్యాన్ని వ్యాపారంగా చేసుకొని , నాలాటి వాళ్లచేత నీకు కావల్సినట్టు రాయించుకొని, నీ వ్యాపారానికి మమ్మల్ని పావులుగా వాడుకొని, నువ్వు సొమ్ము చేసుకుంటున్నావు.'' మాటలు బాణాల్లా వదుల్తున్నాడు విశ్వం.

వాతావరణం వేడెక్కిపోయింది. ప్రొడ్యూసరు, డైరెక్టరు, పబ్లిషరు అందరూ రాజారావుని, విశ్వాన్ని మార్చి మార్చి చూస్తున్నారు.

విశ్వాన్ని ఇలాగే వదిలేస్తే తను ఫీల్డులో నిలబడడం కష్టం. అతన్ని పడగొట్టాలి అనుకున్నాడు రాజారావు.

ఈనాటి రాజారావు ఉన్నత స్థితికి విశ్వం కారకుడా! ఆ భావం ఎవరికీ కలగకూడదు. అలాటి బీజం అందర్లో నాటుకుంటే ఫీల్డులో తన పొజిషను మారిపోతుంది. విశ్వం టాప్ రేంక్‌లోకి వెళ్లిపోతాడు. తనకి నూకలుండవు.

కంగారు పడుతున్నాడు రాజారావు. కాని నిగ్రహించుకొని చిరు నవ్వు నవ్వాడు.

''ఆల్‌రైట్ విశ్వం! నీ పాయింట్‌కే వద్దాం. ఈనాటి నా స్టేటస్‌కి నువ్వే కారణం అంటావు బాగుంది. మరి నువ్వు రాసిచ్చిన కథ పబ్లిషరుగారు తీసుకొచ్చి నా ముఖాన కొట్టారు. నువ్వు రాసిన ట్రాజడీ సీనుతో సినిమా తీస్తే ఫిల్ము డబ్బాలు మూడు రోజుల్లో తిరిగొస్తాయంటున్నారు డైరెక్టరు. మరి వీటికేమంటావు చెప్పు?'' నిలదీసాడు రాజారావు విశ్వాన్ని.

''చెప్పాలా?'' ఎదురు ప్రశ్న వేసాడు విశ్వం.

''చెప్పు? ఏం చేతగాని రాతలుకి నలుగుర్లో సిగ్గేస్తోందా?'' అన్నాడు రాజారావు.

''సిగ్గు నాకు కాదు. చెప్తే నువ్వే సిగ్గు పడాలి. అయినా చెప్తాను. ఆ కథ నేను రాయలేదు. ట్రేజడి సీను నేను రాయలేదు.

''మరి?''

''నువ్వే రాసావు. పెద్ద రైటరువి నువ్వు ఏ చెత్త రాసిపడేసినా పత్రికల వాళ్లు వేసుకుంటారు, జనాలు కళ్లకద్దుకొని చదివేస్తారనుకుని నువ్వు పత్రికకి సీరియల్ పంపిస్తే అది తిరుగు టపాలో తిరిగొచ్చేసిన నీ గొప్ప చెత్త నవల. అదే కథని నీ తెలివి తేటలకి నీ సాహిత్య విద్వత్తుకి మచ్చుతునకగా దాన్ని అలాగే ఏమి మార్చకుండా పబ్లిషరు గారికి ఇచ్చాను పెద్ద దర్శకుడు సర్వేశ్వరరావుగారి సినిమాకి ట్రాజడీ సీను రాయమంటే ఆరుసార్లు మార్చావు కాని రాయలేక నన్ను రాయమని ఇచ్చావు. దాన్ని కూడా అలాగే ఉంచి, వేరే సీను వారికి రాసిచ్చాను. కాని ఈ విషయాలే నువ్వు మరిచి పోయావు. అలా ఉంచి వేసిన ట్రాజడీ సీనే ఈ డైరెక్టరుగారికి ఇచ్చినది. అర్థమైందా?'' నీ ప్రజ్ఞ ఏ మాత్రమో నలుగురికి తెలియ చెయ్యడానికే పత్రికలు వాళ్లు తిప్పి పంపిన కథని పబ్లిషరుకి ఇచ్చాను, నువ్వు రాసిన పరమ చెత్త సీనుని డైరెక్టరుగారికిచ్చాను. దాని ఫలితాలేమిటో నీ విద్వత్తు ఏ పాటిదో నువ్వే ప్రత్యక్షంగా చూసుకున్నావు'' చెప్పడం ఆపాడు విశ్వం.

''విశ్వం... అఖరికి నాకే నామం పెట్టావా?'' వణికి పోతున్నాడు రాజారావు.

''ఇది నీకు నామం పెట్టడం కాదు, నిజం చెప్పడం. విద్వత్తు ఉన్నవాడిని వెలుగులోకి తీసుకురా! అంతే కాని వాడి పేరు మీద నువ్వు చెలామణీ అయిపోకు. నవ్వులపాలవుతావు, గుడ్‌బై.''

గబ గబా అడుగు లేసుకుంటూ వెళ్లిపోతున్న విశ్వాన్ని అదే పనిగా అందరూ చూస్తుండిపోయారు. తెలివి తెచ్చుకొని రాజారావు చూసేటప్పటికి పబ్లిషరు లేదు డైరెక్టరు ప్రొడ్యూసరు కూడా లేరు. □




